క్లుప్తంగా

పలువురు విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్


ఉపేందర్

చిట్యాల: పట్టణంలోని లొయోలా టెక్నో స్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులు శనివారం ఇబ్రహీంపట్నంలో జరిగిన స్టేట్ సబ్ జూనియర్ డ్రాప్ రాబాల్ పోటీల్లో గోల్డ్, బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు ఆ స్కూల్ హెచ్ఎం ఎం.డి.జమీరొద్దీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎనిమిదవ తరగతి చదువుతున్న కంబాలపల్లి గణేష్, శివ, తొమ్మిదవ తరగతి చదువుతున్న కె.ఉపేందర్ గోల్డ్ మెడల్స్ సాధించగా, ఎనిమిద తరగతి విద్యార్థి కె.గణేష్ బ్రాంజ్ మెడల్ సాధించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను ఆ పాఠశాల హెచ్ఎం జమీరొద్దీన్, డైరెక్టర్ తీగల కిరణ్‌కుమార్, బెల్లపు శ్రవణ్‌కుమార్, మోర్తాల వెంకన్న, ఉపాధ్యాయులు అభినందించారు.

వరి కొయ్యలను కాల్చొద్దు


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

కట్టంగూర్ : వరి కోతలు కోసిన తర్వాత ఉన్న కొయ్యలను కాల్చవద్దని మండల వ్యవసాయ అధికారి గిరిప్రసాద్ రైతులకు సూచించారు. వరి కొయ్యలు కాల్చవద్దని శనివారం కట్టంగూర్ గ్రామ పరిధిలోని రాంనగర్‌లోని రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కొయ్యలు కాల్చడం వల్ల భూమికి మేలు చేసే మిత్ర పురుగులు, సూక్ష్మజీవులు చనిపోతాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు పరుశురాములు, నవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

మర్రిగూడ: మండలంలోని తిరగండ్లపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఉడతల అంజయ్య శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర కల్లు గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ శనివారం అంజయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట చెరుకు లింగంగౌడ్, అయిలి నరసింహాగౌడ్, జంగయ్య, పందుల రాములు గౌడ్, నీళ్ల లింగస్వామి, రాణి పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయాలి

నల్లగొండ టౌన్ : మిర్యాలగూడలో డిసెంబర్ 2న నిర్వహించనున్న సీపీఎం బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య పిలుపునిచ్చారు. నల్లగొండలో శనివారం నిర్వహించిన పార్టీ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు ముఖ్య అతిథులుగా సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, జూలకంటి రంగారెడ్డి, నంద్యాల నరసింహారెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండి సలీం, తుమ్మల పద్మ, కుంభం కృష్ణారెడ్డి , అద్దంకి నరసింహ, కోట్ల అశోక్ రెడ్డి, దండెంపల్లి సరోజ,గాదె నరసింహ, భూతం అరుణ కుమారి, గుండాల నరేష్, మారగోని నగేష్, గంజి నాగరాజు, సైదాచారి పాల్గొన్నారు.

సీసీ రోడ్లు నిర్మించాలి

నల్లగొండ టౌన్ : పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణాలు జరిగిన చోట వెంటనే సీసీ రోడ్లు నిర్మించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండి సలీం డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీ, నందీశ్వర్ కాలనీ, ఎన్జీవో కాలనీల్లో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీని పరిశీలించి మాట్లాడారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణంలో లోపాలను పరిశీలించాల్సిన పబ్లిక్ హెల్త్ అధికారుల జాడ కనిపించకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, కోట్ల అశోక్ రెడ్డి, కందుల అశోక్, ఊట్కూరి మధుసూదన్ రెడ్డి, గుండాల నరేష్, దేవరంపల్లి వెంకట్ రెడ్డి, మందడి రాజశేఖర్ రెడ్డి, పిచ్చయ్య, గిరి పాల్గొన్నారు.

విద్య, ఉద్యోగాల్లో బీసీలకు అన్యాయం

నల్లగొండ రూరల్: విద్య, ఉద్యోగాల్లో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పాలిటెక్నిక్ ఎడ్యుకేషన్ బ్లాక్‌వార్డు క్లాస్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రేషం కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో బీసీ కమిషన్‌కు సమస్యలు వివరించారు.ఆయన వెంట అసోసియేషన్ కార్యదర్శి వెంకట రమణ ఉన్నారు.

పర్సు అందజేత

నార్కట్‌పల్లి: మండల పరిధిలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తురాలు పోగొట్టుకున్న పర్సును పోలీసులు తిరిగి ఆమెకు అప్పగించారు. శుక్రవారం రాత్రి చెర్వుగట్టు ఆలయంలో ఓ భక్తురాలు తన పర్సు పోగొట్టుకుంది. ఆ పర్సు ఇతర భక్తులకు దొరకడంతో వారు అక్కడే ఉన్న పోలీసులకు అప్పగించారు. పోలీసులు మైకు ద్వారా వివరాలు తెలియజేయడంతో శనివారం బాధితురాలు నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు రావడంతో హెడ్‌కానిస్టేబుల్ రమేష్, హోంగార్డు రమేష్ పర్సును ఆమెకు అందజేశారు.

పోస్టింగ్ ఒకచోట.. విధులు మరోచోట!

- విద్యుత్ శాఖలో సిబ్బంది ఇష్టారాజ్యం
- నకిరేకల్ సబ్‌డివిజన్‌లో 8 మంది ఉద్యోగులది ఇదే తీరు
- తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం
- ఇబ్బందులు పడుతున్న విద్యుత్ వినియోగదారులు


విద్యుత్ సబ్‌స్టేషన్

శాలిగౌరారం: సాధారణంగా ఏ శాఖకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి అయినా ఉన్నతాధికారులు ఎక్కడ పోస్టింగ్ ఇస్తే అక్కడే విధులు నిర్వర్తించవలసి ఉంటుంది. కానీ విద్యుత్ శాఖలో మాత్రం కొంతమంది కిందిస్థాయి ఉద్యోగులు పోస్టింగ్‌తో సంబంధం లేకుండా తమ ఇష్టానుసారం నచ్చిన చోటే విధులు నిర్వర్తిస్తున్నారు. విషయం సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా వారు ఉదాసీన వైఖరితో వ్యవహరిస్తున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే సిబ్బంది లేకపోవడం వల్ల విద్యుత్ వినియోగదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ఎనిమిది మంది ఆర్టిజన్ సిబ్బంది..

నకిరేకల్ విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని శాలిగౌరారం, నకిరేకల్, కేతేపల్లి, కట్టంగూరు మండలాల్లో పనిచేస్తున్న 8మంది ఆర్టిజన్ సిబ్బంది పోస్టింగ్ ఒకచోట ఉంటే విధులు మరోచోట నిర్వర్తిస్తున్నారు. విషయం ఉన్నతాధికారులకు తెలిసినప్పటికీ వారికి వేతనం మాత్రం పోస్టింగ్ ఇచ్చిన చోటనే విధులు నిర్వర్తిస్తున్నట్లు ఇవ్వడం గమనార్హం. అందులో శాలిగౌరారం మండలంలోనే నలుగురు సిబ్బంది ఉన్నారు. శాలిగౌరారం మండల కేంద్రంలో పోస్టింగ్ పొందిన ఓ ఆర్టిజన్ విద్యుత్ ఉద్యోగి ఇదే మండలం వల్లాలో విధులు నిర్వర్తిస్తున్నాడు. పెర్కకొండారంలో పోస్టింగ్ పొందిన ఆర్టిజన్ ఉద్యోగి అడ్లూరులో విధులు నిర్వర్తిస్తున్నాడు. అదేవిధంగా వల్లాలో పోస్టింగ్ పొందిన ఆర్టిజన్ ఉద్యోగి కేతేపల్లి మండల కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. మనిమద్దెలో పోస్టింగ్ పొందిన ఆర్టిజన్ ఉద్యోగి కట్టంగూరు మండలం ఈదులూరులో విధులు నిర్వర్తిస్తున్నాడు. అదే విధంగా కేతేపల్లిలో పోస్టింగ్ పొందిన ఆర్టిజన్ ఉద్యోగి పెర్కకొండారంలో విధులు నిర్వర్తిస్తుండగా.. కట్టంగూరు మండలం ఈదులూరులో పోస్టింగ్ పొందిన ఆర్టిజన్ ఉద్యోగి శాలిగౌరారం మండలం మనిమద్దెలో విధులు నిర్వర్తిస్తున్నాడు. కేతేపల్లి మండలం కాసనగోడు పోస్టింగ్ పొందిన ఆర్టిజన్ ఉద్యోగి నకిరేకల్ ఏ సర్కిల్‌లో విధులు నిర్వర్తిస్తుండగా.. నకిరేకల్ ఏ సర్కిల్‌లో పోస్టింగ్ పొందిన ఆర్టిజన్ ఉద్యోగి కాసనగోడులో విధులు నిర్వర్తిస్తున్నాడు. 2022 జూన్ 30న ఆర్టిజన్‌లకు డీఈ పోస్టింగ్ ఇచ్చారు. కానీ ఆర్టిజన్లు డీఈ ఇచ్చిన పోస్టింగ్ చోట కాకుండా నచ్చిన చోట ఉద్యోగం చేస్తున్నారు.

గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది



మండల కేంద్రంలో విద్యుత్ లైన్లు గజిబిజిగా ఉన్నాయి. విద్యుత్ లైన్లలో ఏమాత్రం సమస్య ఏర్పడినా గంటల తరబడి సరఫరా నిలిచిపోతోంది. విద్యుత్ సరఫరాలో తరచూ జరుగుతున్న అంతరాయాల వల్ల నానా ఇబ్బందులు పడుతున్నాం. వానాకాలంలో అయితే పరిస్థితిని ఊహించడం కష్టం.

– గుజిలాల్ శేఖర్‌బాబు, ఫర్టిలైజర్ వ్యాపారి, శాలిగౌరారం

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు ఏబీ స్విచ్‌లు లేవు



మండల కేంద్రంలో చాలావరకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు ఏబీ స్విచ్‌లు లేవు. ఏదేని కారణం వల్ల ట్రాన్స్‌ఫార్మర్లపై ఫ్యూజులు పోతే మండల కేంద్రంలోని ఫీడర్లన్నింటికి విద్యుత్ సరఫరా నిలిపివేసి ఎల్‌సీ తీసుకొని ఫ్యూజులు వేయాల్సి ఉంటుంది. సిబ్బందిని నియమించడంతో పాటూ ట్రాన్స్‌ఫార్మర్లకు ఏబీ స్విచ్‌లు అమర్చాలి.

– చిత్తలూరి శ్రీనివాసులు, రైతు, శాలిగౌరారం

అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం

మండలంలో విద్యుత్ శాఖలో మూడు పోస్టులు ఖాళీలు ఉన్నాయి. అందులో రెండు అసిస్టెంట్ లైన్‌మెన్, ఒకటి జూనియర్ లైన్‌మెన్ పోస్టులు. ఇవి కూడా ఇటీవల జరిగిన బదిలీలు, పదోన్నతుల కారణంగా ఏర్పడ్డాయి. ఉన్న సిబ్బందితో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలుగకుండా పర్యవేక్షణ చేస్తున్నాం.

– శ్రీధర్, విద్యుత్ ఏఈ, శాలిగౌరారం మండలం

మూసీ ప్రక్షాళనతోనే ప్రజలకు మేలు

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం


మూసీ రిజర్వాయర్‌లో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : మూసీ ప్రక్షాళనతోనే ప్రజలకు మేలు జరుగుతుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ మండలం పరిధిలోని మూసీ రిజర్వాయర్‌లో జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో శనివారం 9లక్షల చేప పిల్లల వదిలివేత కార్యక్రమాన్ని ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. మూసీ నీటిలో సూపర్ బాక్టీరియా ఉందని ..దీనిని తొలగించక పోతే ఇక్కడ మనుషుల మనగడ ఉండదన్నారు. దీనిని అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ కనుకు వెంకటనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరావు, జిల్లా మత్స శాఖ సపరింటెండెంట్ శ్రీనివాస్, ప్రసాద్ మూసీ సాదుల నర్సయ్య, అలువాల వెంకటస్వామి, బీమనబోయిన లక్ష్మయ్య, అల్లి సైదులు, అంబటి అంజయ్య, కొరిమి వెంకటేష్,ఈదూల యాదగిరి, మాద లక్ష్మీనారయణ తదితరులు పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు

నకిరేకల్ నియోజకవర్గానికి ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేసిందని ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. నకిరేకల్‌లోని తన ఉద్దీపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వీవీఎం ఎయిడెడ్ పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. స్కూల్ మంజూరు పట్ల సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు నార్కట్‌పల్లిలో యూటీఎఫ్ జిల్లా మహాసభ

నార్కట్‌పల్లి: మండల కేంద్రంలో ఆదివారం యూటీఎఫ్ జిల్లా 6వ మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన సంఘం అధ్యక్షుడు సపావత్ భానుప్రకాష్, సంఘం మండల అధ్యక్షుడు నర్రా రవీందర్‌రెడ్డి తెలిపారు. మహాసభకు ముఖ్య అతిథిగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి, జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సైదులు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం హాజరుకానున్నారని తెలిపారు. యూటీఎఫ్ నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ప్రతి ఖాతాదారుడు బీమా చేయించుకోవాలి


రాంరెడ్డిపల్లిలో ఇన్సూరెన్స్ చేస్తున్న బ్యాంక్ మిత్ర లింగయ్య

మర్రిగూడ: మండలంలోని శివన్నగూడ యూనియన్ బ్యాంక్‌లో అకౌంట్ కలిగిన ప్రతి ఖాతాదారుడు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం జేజేబీవై, పీఎం ఎస్‌బీవై బీమా చేయించుకోవాలని యుబీఐ బ్యాంక్ మిత్ర కల్లెట్ల లింగయ్య అన్నారు. శనివారం రాంరెడ్డిపల్లి గ్రామంలో యూనియన్ బ్యాంకులో ఖాతాలు లేని వారికి ఖాతాలు ప్రారంభించడంతోపాటు ఖాతాలు కలిగిన వారికి ఇన్సూరెన్స్‌లు చేశారు. కార్యక్రమంలో బీమనగాని యాదయ్య, మారగోని కృష్ణయ్య పాల్గొన్నారు.

బస్టాండ్ స్థలాన్ని పరిశీలించిన లోకాయుక్త అధికారులు


మునుగోడులోని ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని పరిశీలిస్తున్న లోకాయుక్త అధికారులు

మునుగోడు: కొంత కాలంగా వివాదాస్పదంగా మారిన మునుగోడులోని ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని శనివారం లోకాయుక్త అధికారులు పరిశీలించారు. జేఎన్‌టీయూ మాజీ ప్రిన్సిపాల్ కంచర్ల దశరథరెడ్డికి మునుగోడు గ్రామంలోని సర్వే నంబర్ 11లో పట్టా భూమి కలదు. అయితే ఆ భూమిని ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 10లో కొంత భూమిని అప్పటి రెవెన్యూ అధికారులు 25 ఏళ్ల క్రితం ఆర్టీసీకి కేటాయించారు. కానీ ఆ ఆర్టీసీ బస్టాండ్ కేటాయించిన భూమి దాదాపు సగానికి పైగా దశరథ పట్టా కలిగిన సర్వే నంబర్ 11లో ఉండటంతో ఆయన ఐదేళ్ల క్రితం లోకాయుక్తని ఆశ్రయించగా న్యాయమూర్తులు ఆయన భూమిని ఆయనకు వదిలేయాలని తీర్పు చెప్పారు. దీంతో ఆయనకు స్థానిక రెవెన్యూ అధికారులు గత ఏడాది క్రితం సర్వేచేసి హద్దులు నిర్ణయించినట్లు కోర్టులో సంబంధిత నివేదికలు లోకాయుక్త కోర్టుకు అందించారు. దీంతో తనకు ఉన్న పట్టా ప్రకారం భూమి చూయించలేదని, అంతే కాకుండా సర్వే నంబర్ ప్రకారం సరైన హద్దులు నిర్ణయించలేదని దశరథరెడ్డి తిరిగి న్యాయమూర్తులకు అప్పీల్ చేసుకోగా ఆ స్థలాన్ని ప్రత్యేక్షంగా పరిశీలించాలని లోకాయుక్త డిప్యూటీ డైరెక్టర్ తాజ్‌హుద్దిన్‌కు ఆదేశాలు జారీ చేశారు. తాము గుర్తించిన లోటుపాట్లని లోకాయుక్త న్యాయమూర్తికి నివేదిక రూపంలో అందచేస్తామని పరిశీలనకు వచ్చిన అధికారులు తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో సంబరాలు


మిఠాయిలు పంచుకుంటున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్: మహారాష్ట్రలో బీజేపీ ఘన విజయం సాధించిన సందర్భంగా ఆ పార్టీ నాయకులు శనివారం నల్లగొండ పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్లో టపాకులు కాల్చి సంబరాలు నిర్వహించారు. పార్టీ నాయకులు మిఠాయిలు పంచిపెట్టారు. ఈసం సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి చేసిన అభివృద్ధి సంక్షేమంతోనే మహారాష్ట్ర ప్రజలు బీజేపీకి పట్టం కట్టారని తెలిపారు. కార్యక్రమంలో బబీజేపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బండారు ప్రసాద్, వీరెల్లి చంద్రశేఖర్, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, పిల్లి రామరాజు యాదవ్, ఫకీరు మోహన్ రెడ్డి, కాశమ్మ విజయ నీరజ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి

నల్లగొండ క్రైం: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించిన సైబర్ నేరాలు, గంజాయి నిషేధంపై ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలో తెలిసీ తెలియక చెడు వ్యసనాల వైపు వెళుతుంటారని అన్నారు. సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు చెప్పినట్లుగా నడుచుకుంటే క్రమశిక్షణతో కూడిన బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. సైబర్ క్రైం ఎక్కువగా జరుగుతుందని, సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయం ఏర్పడి మోసాలకు గురవుతున్నారని వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలను వేధిస్తే కఠిన చట్టాలున్నాయని తెలిపారు. అత్యవసర సమయంలో 100 నంబర్‌కు, సైబర్ నేరాలకు గురైతే 1930 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సంధ్య, ఎస్ఐ శంకర్, సిబ్బంది కృష్ణ, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ సాధనలో సీపీఐది కీలక పాత్ర

కేతేపల్లి: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో సీపీఐ కీలకపాత్ర పోషించిందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ అన్నారు. సీపీఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా శనివారం మండలంలోని గుడివాడ గ్రామంలో ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సమితి సభ్యులు గొని లక్ష్మీనర్సయ్య, మండల కన్వీనర్ ఊట్కూరు నర్సింహారాజు, జాజాల గంగయ్య, సూరారపు అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.


గుడివాడలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎంఈఓకు సన్మానం


మండల విద్యాధికారి అరుంధతిని సన్మానిస్తున్న విద్యా శాఖ సిబ్బంది

తిప్పర్తి: ఇటీవల తిప్పర్తి నుంచి బదిలీ అయిన మండల విద్యాధికారి కత్తుల అరుంధతిని శనివారం మండల విద్యా శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి మాట్లాడుతూ అరుంధతి పాఠశాలల అభివృద్ధికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి నరసింహనాయక్, తగరం అరుణశ్రీ, షౌకత్‌అలీ, జయమ్మ, వెంకటయ్య, మహేందర్‌రెడ్డి, కొడదల శంకర్, ఆదిమల్ల శ్రీనివాస్, గుర్రం రవి, దామెర్ల వెంకయ్య, లింగమల్లు, శేషయ్య, లక్ష్మీనారాయణ, తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళా సంఘంలో సభ్యులుగా చేరాలి


సభ్యులుగా చేరాలని బొట్టు పెట్టి ఆహ్వానిస్తున్న మహిళలు

చండూరు(గట్టుప్పల్) : స్వయం సహాయక మహిళా సంఘంలో సభ్యులుగా చేరి పొదుపు చేసుకోవాలని సెర్ప్ సీసీ అండాలు మహిళలను కోరారు. తెలంగాణ సంబురాల్లో భాగంగా సంఘంలో సభ్యులుగా చేరని మహిళలను ఆమె సంఘం సభ్యులతో కలిసి ఇంటింటికీ తిరిగి బొట్టు పెట్టి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అర్హత కలిగిన మహిళలు తప్పని సరిగా సంఘంలో సభ్యులుగా చేరాలన్నారు.

సమాజానికి మీడియా అద్దం లాంటిది


మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠీ


ప్రెస్‌క్లబ్ లోగోను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

- కలెక్టర్ ఇలా త్రిపాఠీ

నల్లగొండ టూటౌన్ : సమాజానికి మీడియా ఒక అద్దం లాంటిదని కలెక్టర్ ఇలా త్రిపాఠీ అన్నారు. నల్లగొండ పట్టణంలోని రామగిరిలో శనివారం ప్రెస్‌క్లబ్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో మంచితో పాటు కొన్ని లోపాలు కూడా ఉంటాయని, వాటిని జర్నలిస్టులు మీడియా ద్వారా తమ దృష్టికి తీసుకువస్తే జిల్లా యంత్రాంగం తరఫున తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మీడియా సమాజానికి పారదర్శకంగా, ఒక స్ఫూర్తితో పని చేయాలన్నారు. జర్నలిస్టుల ఇంటి స్థలాల విషయం దృష్టిలో ఉందని, ఆ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర కీలకమన్నారు. జర్నలిస్టులు అందరు ఐక్యంగా ఉంటే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని స్పష్టం చేశారు. మంత్రి చొరవతో సీనియారిటీ ప్రకారం జర్నలిస్టులకు ఇంటి స్థలాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ప్రెస్‌క్లబ్ నల్లగొండ లోగోను చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమాచార శాఖ ఏడీ వెంకటేశ్వర్లు, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యేరెడ్ల చంద్రశేఖర్‌రెడ్డి, వంగాల శ్రీనివాస్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి, కోశాధికారి గుండాల యాదగిరి, గౌరవ సలహాదారులు చింతకింది గణేష్, బొడ్డు జనార్దన్‌రెడ్డి, కార్యవర్గ బాధ్యులు అశోక్‌రెడ్డి, మంజుల, విజయభాస్కర్, కిరణ్‌రెడ్డి, మట్టయ్య, అశ్వాక్ అహ్మద్, కట్ల సుధాకర్, కంది భజరంగ్‌ప్రసాద్, సయ్యద్, ఉపేందర్, మీసాల శ్రీనివాస్, మదనాచారి, పిట్టల రామకృష్ణ, ఫణీంద్ర, భాస్కర్, చంద్రశేఖర్, ఉయ్యాల లింగయ్య, సత్యం, దశరథ, కంది శ్రీనివాస్, ప్రసాద్, రాంప్రసాద్, కనకయ్య పాల్గొన్నారు.

వలంటీర్లలో స్ఫూర్తి నింపాలి


జ్యోతి వెలిగించి ఈశా గ్రామోత్సవాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠీ

నల్లగొండ: ఈశా గ్రామోత్సవంతో జిల్లాలోని మహిళలు వలంటీర్లలో స్ఫూర్తిని నింపాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన ఈశా గ్రామోత్సవం కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. క్రీడాకారులు నల్లగొండ జిల్లాకు బహుమతి తీసుకురావాలని కోరారు. కోయంబత్తూర్‌లో ఉన్న ఈశా కేంద్రాన్ని సందర్శించేందుకు జిల్లా మహిళలు, వలంటీర్లను ఉచితంగా తీసుకువెళ్లేలా ఈశా ఫౌండేషన్ చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం నిర్వహించిన వాలీబాల్, జడ కోలాటంలో కలెక్టర్ పాల్గొని మహిళలకు స్ఫూర్తినిచ్చారు. కార్యక్రమంలో అధికారులు విష్ణుమూర్తి, వెంకటేశ్వర్లు, ప్రసాద్, ఏచూరి శైలజ పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయిబాబా జయంతి


పూజల్లో పాల్గొన్న భక్తులు

చిట్యాల: శ్రీసత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో శ్రీసత్యసాయిబాబా జయంతిని శనివారం చిట్యాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీసత్యసాయి బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి, పాదుకలకు పాలాభిషేకం చేశారు. అనంతరం సాయి బాబా కీర్తనలు, భజనలతో నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం పాల్గొన్న భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో చందా వెంకటేశ్వర్లు, నాగలక్ష్మీ, వేలుపల్లి వెంకటేశ్వర్లు, పద్మ, ఝాన్సీ, రవీందర్, విజయ, నాగమణి, పద్మ, చక్రమ్మ, జనమ్మ పాల్గొన్నారు.

బీఈడీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న దేవరాజ్

నల్లగొండ: బీఈడీ కళాశాలలో సీనియర్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న మేదర విజయదేవరాజు (ఎం.వి. దేవరాజ్)ఏపీలోని నాగార్జున యూనివర్సిటీ డిపార్టుమెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ నుంచి డాక్టరేట్ పొందారు. యూనివర్సిటీలోని ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్తేర్ సునీల పర్యవేక్షణలో స్పిరిచువల్ ఇంటెలిజెన్స్ పర్సనాలిటీ ట్రైయిడ్స్ అండ్ వర్కు ఎథిక్స్ ఆఫ్ సెకండరీ స్కూల్ టీచర్స్ అనే అంశంపై పరిశోధన చేసి గ్రంథం సమర్పించడంతో పీహెచ్‌డీ డాక్టరేట్ అందజేశారు. దేవరాజు ప్రస్తుతం సూర్యాపేట జిల్లా వీసీ కాలేజీలో సీనియర్ అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. డాక్టరేట్ రావడంతో కళాశాల యాజమాన్యం రామదాసు, శ్రీనివాస్, డీవీఎం కాలేజీ ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, ఎంఈడీ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సి పాల్ బొడ్డుపల్లి రామకృష్ణ అభినందనలు తెలిపారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న మందా నరేందర్‌రెడ్డి

హాలియా : జన విజ్ఞాన వేదిక నల్లగొండ శాఖ ఆధ్వర్యంలో హాలియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో వివిధ పాఠశాలల విద్యార్థులకు మండలస్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో స్థానిక టైం స్కూల్‌కు చెందిన విద్యార్థులు జశ్వంత్, దీక్షిత్‌కుమార్, సాయి భవజ్ఞ ఉత్తమ ప్రతిభ కనబర్చి మొదటి స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచి జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక జిల్లా బాధ్యులు లింగాల సైదులు బహుమతులు అందజేశారు.

మహిళలపై దాడులను నిరసిస్తూ ర్యాలీ

నల్లగొండ టౌన్ : మహిళలపై జరుగుతున్న దాడులు నిరసిస్తూ గైనకాలజిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్ నుంచి ఐఎంఏ భవన వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ సైదులు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. హింస, అన్యాయం దాడులు, దౌర్జన్యాలపై ఉన్న చట్టాలు, హక్కులపై వివరించారు. మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ అంజలి మాట్లాడుతూ నిర్భయ చట్టం బాలికలు, మహిళలకు భరోసానిస్తుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షురాలు ఆర్.మంజుల, కార్యదర్శి రాజేశ్వరి సుచరిత, వసంతకుమారి, లీలావతి సింధూర, నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

నాంపల్లి: అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చింతపల్లి ప్రాజెక్ట్ సీడీపీఓ సుక్కుబాయి అన్నారు. నాంపల్లి మండలంలోని నాంపల్లి, వడ్డెపల్లి గ్రామాల్లోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. ఆమె వెంట సూపర్‌వైజరు ముమ్మడి యశోద,అంగన్‌వాడీ కార్యకర్త ఎదుళ్ల థెరిస్సా, వెంకటమ్మ ఉన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న సీడీపీఓ సక్కుబాయి

గ్రంథాలయానికి పుస్తకాలు బహూకరణ


పుస్తకాలను అందజేస్తున్న సురేష్

రామగిరి(నల్లగొండ): జిల్లా కేంద్ర గ్రంథాలయానికి టెలికం శాఖ ఐటీసీ డైరెక్టర్ సురేష్‌రెడ్డి శనివారం పుస్తకాలు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసము, జీవిత చరిత్ర లకు సంబంధించి పుస్తకాలు నేటి యువతకు ఎంతో అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లైబ్రేరియన్ కట్టా నాగయ్య, రాజేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వం

నార్కట్‌పల్లి : సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో యాక్షన్ ప్లాన్ లేకుండా వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు. హామీల అమలులో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆయన విమర్శించారు. సమావేశంలో మేకల రాజీరెడ్డి, దోసపాటి విష్ణు, బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, కొండురు శంకర్, మల్లేబోయిన సైదులు ఉన్నారు.